జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త. కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 26-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 110 పేజీలు: 8 వెల : రూ.7

## వైసీపీ ప్రభుత్వం.. ఉపాధ్యాయులను వేధించింది

* అందుకే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారు * సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకం
* ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయు ముందంజ * పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు * ఎమ్మెల్యే గొండుతో కలిసి పీఆర్‌టీయు భవనం ప్రారంభం

**శ్రీకాకుళం, ఆగస్టు 25 (వార్త):** వైసీపీ పాలనలో ఉపాధ్యాయులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు.. అప్పట్లో మంత్రుల వ్యాఖ్యలతో ఉపాధ్యాయులు మానసిక క్షోభ పడ్డారు.. వారిపై సోషల్ మీడియా వేదికగా కూడా దాడులు చేశారు.. గురుతరమైన బాధ్యతలు పోషించే ఉపాధ్యాయుల పట్ల గత ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించింది.. అందుకే వైసీపీకి ఉపాధ్యాయ వర్గం సరైన గుణపాఠం చెప్పింది.. ఉపాధ్యాయులను వేధించే ఏ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎక్కువ కాలం మనుగడ సాధించలేదు.. అని పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని అరసవల్లి ఆలయం సమీపంలో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయు) నూతన భవనాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సహనం, భిన్నత్వం పట్ల గౌరవం వంటి ప్రజాస్వామ్య విలువలను ప్రోత్సహించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. చరిత్ర అంతటా, ఉపాధ్యాయులు సమాజంలో గొప్ప, అత్యంత బాధ్యతగల వ్యక్తులుగా పరిగణించబడ్డారని పేర్కొన్నారు. వారు తరువాతి తరానికి అవగాహన కల్పిస్తారని వారి వ్యక్తిగత, సామాజిక జీవితాలను మెరుగుపరచడానికి వారికి జ్ఞానం, నైపుణ్యాలను అందిస్తారని తెలిపారు. పీఆర్‌టీయు భవనాన్ని తానే శంకుస్థాపన చేశారని మరలా తానే ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను సమాజంలో మేధావి వర్గంతో పోలుస్తారని అటువంటి ఉపాధ్యాయులను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఉపాధ్యాయుల పట్ల ఎంతో అపారమైన గౌరవం ఉందని తెలిపారు.



### క్రీడామైదానాలను అభివృద్ధి చేయాలి

రాష్ట్రంలో రానున్న ఐదేళ్లలో క్రీడాభివృద్ధికి పెద్దపీట వేసి క్రీడాకారులకు అండగా ఉంటామని కేంద్ర పౌర, విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని డీఈవో కార్యాలయ సమీపంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నూతన భవనాన్ని ఆదివారం కేంద్ర పౌర, విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు క్రీడల ఖిల్లాగా పేరుందని, జిల్లాకు చెందిన ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లా కీర్తిని దేశనలుమూలలా ఇనుమడింప జేశారని కొనియాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న క్రీడా మైదానాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీనిచ్చారు. రానున్న ఐదేళ్లలో అన్ని క్రీడాంశాల్లో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ భవనంపై క్రీడాకారులు విశ్రాంతి తీసుకునేందుకు తన ఎంపీ ల్యాడ్ నుంచి నిధులు కేటాయించి ఆరు నెలల్లో నూతనంగా భవనం నిర్మించి అందజేస్తానని హామీనిచ్చారు. గత ప్రభుత్వం క్రీడలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, క్రీడాకారుల జీవితాలతో ఆటలాడుకుందని చెప్పారు. క్రీడలకు సంబంధించి ఎటువంటి నిధుల కేటాయింపులు చేయకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండి పోయిందని తెలిపారు. రాష్ట్రంలో, జిల్లాలో యువక్రీడాకారులు ఎందరో క్రీడలకు దూరం అయ్యారని, మరలా వారిని గుర్తించి వారి ప్రతిభను వెలికి తీస్తామని చెప్పారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మృత్యుశకటం



* రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకు దుర్మరణం * ఉప్పరనాయుడు వలసలో విషాదఛాయలు * కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 25 (వార్త):** కళాశాలలో చదువుతున్న కుమార్తెను చూసేందుకు వెళ్లి వస్తున్న తండ్రి, కొడుకును మృత్యువు కబళించింది. ఒకేసారి ఇద్దరూ మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఆ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టేసింది. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలం ఉప్పరనాయడువలసకు చెందిన కరణం రామకృష్ణ, రాణీరత్నం దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు కిరణ్‌కుమార్ విజయనగరంలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల కిందట సెలవు పెట్టి ఇంటికి వచ్చాడు. కుమార్తె భోగాపురంలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో ఇటీవల చేరింది. ఆదివారం కుమార్తెను చూసేందుకు రామకృష్ణ.. తన కొడుకు కిరణ్‌కుమార్‌తో కలిసి ద్విచక్రవాహనంపై భోగాపురంలోని కళాశాలకు వెళ్లాడు. కుమార్తెను కలిసిన తర్వాత తండ్రీ కొడుకులిద్దరూ భోగాపురం నుంచి శ్రీకాకుళం వైపు వస్తుండగా, రణస్థలం సమీపంలోని జాతీయ రహదారిపై వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో వీరిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. జేఆర్‌పురం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. లారీడ్రైవర్ వెంకటరమణను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. భర్త, కుమారుడు మృతి చెందడంతో రాణీరత్నం బోరున విలపించింది.

### ఆలయంలో.. ఏడు సార్లు దొంగలు పడ్డారు!

**పలాస:** కంబిరిగాం రోడ్డులోని సీతమ్మ తల్లి ఆలయంలో 2014 నుంచి ఆదివారం వరకూ ఏడుసార్లు దొంగలు పడ్డారు. శనివారం రాత్రి కూడా ఆలయంలో దొంగలు పడి సీసీ కెమెరాల వైర్లు కత్తిరించి అమ్మవారి హుండీలోని నగదును అపహరించుకుపోయారు. ఆలయ అర్చకులు ఇప్పిలి సాయమ్మ ఆదివారం ఉదయం తెరవడానికి వచ్చేసరికి ఆలయ తాళాలు బద్దలుగొట్టినట్టు గుర్తించారు. లోపలికి వెళ్లి పరిశీలిం చగా హుండీ కనిపించలేదు. వెంటనే స్థానిక కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, కమిటీ సభ్యులు గాలి కృష్ణారావు, చిన్నారావు, హరికృష్ణకు సమాచారం అందించారు. వారు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తరచూ దొంగతనాలు జరుగుతున్న దృష్ట్యా అమ్మవారి నగలు ప్రతి మంగళవారం అలంకరించి దాచేస్తుంటారు. హుండీ లెక్కింపు కూడా మూడు నెలలకు ఓసారి నిర్వహిస్తుంటారు. ఈ మేరకు కొద్ది రోజుల కిందటే హుండీని తెరిచారు. దొంగలు చొరబడి ముందుగా సీసీ కెమెరాలకు ఉన్న వైర్లను కత్తిరించేశారు. శ్రీకాకుళం క్లూస్ టీమ్ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు. దొంగలు వచ్చే మార్గాన్ని అంచనా వేశారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులుకేసు నమోదు చేశారు.

## ఉత్తరాంధ్రకే తలమానికం.. జెమ్స్ ఆసుపత్రి

* రిమ్స్, జెమ్స్‌లను మెడికల్ హబ్ స్థాయికి తీసుకెళ్లాలి * మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * కేంద్ర, రాష్ట్ర మంత్రులను కలిసిన కిమ్స్, జెమ్స్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావు



**శ్రీకాకుళం, ఆగస్టు 25 (వార్త):** ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు ఆరోగ్య సమాజం కోసం ఎంతో మంది వైద్యులను అందిస్తున్న జెమ్స్ ఆసుపత్రి ఇటు ఉత్తరాంధ్ర, అటు ఒడిశాకు తలమానికంగా మారిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశంసించారు. ఆదివారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ఆయనను కిమ్స్, జెమ్స్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావు ఆత్మీయ పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యాధునిక మౌలిక వసతులతో నిర్మించిన జెమ్స్ హాస్పిటల్, జేమ్స్ మెడికల్ కాలేజీ, బొల్లినేని స్కిల్ సెంటర్‌లు, కొత్తగా విస్తరిస్తున్న కిమ్స్ ఆస్పత్రితో పాటు టెక్కలి జిల్లా ఆసుపత్రి, రిమ్స్ వైద్య కళాశాల, రిమ్స్ జనరల్ ఆస్పత్రి, మిగిలిన కార్పోరేట్ ఆసుపత్రులను అనుసంధానిస్తూ ఒక మెడికల్ హబ్‌గా శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించి, యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పించేందుకు స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం ప్రణాళికను రూపొందించాలని, ప్రభుత్వం తరపున తమ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రం చుట్టూ త్వరలోనే రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు. జెమ్స్ మెడికల్ కాలేజీ, దానికి అనుబంధంగా ఉన్న ఆసుపత్రి మెడికల్ యూనివర్సిటీ స్థాయికి చేరుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. మంత్రిని కలిసిన వారిలో జెమ్స్ సీఈవో బొల్లినేని అద్విత్, డైరెక్టర్లు డాక్టర్ కే సుధీర్, డాక్టర్ గూడెన సోమేశ్వరరావు, స్వర్ణ రామ్మోహన రావు తదితరులు ఉన్నారు. అలాగే శ్రీకాకుళం నగరంలోని రామ్మోహన్ నాయుడు నివాసంలో కిమ్స్ అధినేత బొల్లినేని భాస్కరరావు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జెమ్స్ భోధనాసుపత్రి ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కేన్సర్ రీసెర్చ్ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం పట్ల కిమ్స్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావును కేంద్ర మంత్రి అభినందించారు.

## జాతీయ స్థాయి కవితల పోటీల్లో కుప్పిలికి తృతీయ బహుమతి



ఆమదాలవలస, ఆగస్టు 25(వార్త): జాతీయ స్థాయి కవితల పోటీల్లో ఆమదాలవలసకు చెందిన కుప్పిలి వెంకట రాజారావు రచించిన 'సమరానికి ఊపిరై'అనే కవితకు తృతీయ బహుమతి లభించింది. హైదరాబాదుకు చెందిన నవభారత నిర్మాణ సంస్థ స్వాతంత్ర్య సమరయోధుడు అల్వాల బాల్‌రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా ఈ పోటీలను ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించింది. కుప్పిలికి బహుమతి వచ్చినట్టు ఆ సంస్థ అధ్యక్షుడు సూరేపల్లి రవికుమార్ తెలిపారు. దీంతో కుప్పిలికి పలువురు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుప్పిలి మాట్లాడుతూ ఈ పోటీల్లో బహుమతి రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

# భరోసా ఏదీ?

■ భృతి జాప్యంపై మత్స్యకారుల ఆగ్రహం ■ ప్రభుత్వ తీరుపై మండిపాటు ■ అందరికీ ఇవ్వాలని వినతి



(సోంపేట)

వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం ఇస్తున్న పది వేల భృతిని రూ.20,000కు పెంచుతామని మత్స్యకారులకు చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా ఈ హామీ నెరవేరలేదు. ఇప్పటిదాకా మత్స్య కార భరోసా తమ ఖాతాల్లో నేటికీ జమ కాకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**అగమ్యగోచరంగా**

**వలస మత్స్యకారుల పరిస్థితి..**

ఈ హామీ నెరవేరకపోవడంతో వలస మత్స్యకారులు పరిస్థితి మరీ ఇబ్బందికరంగా మారింది. ఏడాదికి ఒక్కసారి ప్రభుత్వం అందించే వేట నిషేధ భృతి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లలేక, స్థానికంగా ఉండలేక వారు పడుతున్న అవస్థలు అన్నీ..ఇన్నీ కావు. జిల్లావ్యాప్తంగా ఉన్న 4000 బోట్లుకు సంబంధించి 15,200 మంది అసలైన లబ్ధిదారులను మత్సశాఖ అధికారులు సుదీర్ఘ కసరత్తు చేసి జాబితా సిద్ధం చేశారు. నిజమైన వేటగాళ్లకు ఈ భరోసా ఇవ్వాలని ఆలోచనతో అటు పాలకులు, ఇటు అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

**నిబంధనలు సడలించాలి..**

వాస్తవానికి సముద్రంలో వేటను నమ్ముకుని బతుకుతున్న మత్స్యకారులకు మాత్రమే నిషేధకాలంలో భృతిని అందజేయాల్సి ఉంది. అయితే ఇతరత్రా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుకున్న వారు ఎవరైనా ఇందులో ఉంటే వారికి భరోసా వర్తింపచేయకూడదన్న నిబంధన ప్రభుత్వం విధించింది. దీంతో ఈ భరోసాకు దూరమవుతున్న వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెంచిన పదివేల రూపాయలు కాకుండా ఇదివరకే ఉన్న పది వేల రూపాయలైనా అందరికీ వర్తించేలా నిబంధనలు సడలించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

**మత్స్యకారుల అసంతృప్తి..**

ఏటా ఏప్రిల్ 16 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో వేటనిషేధం అమలవుతోంది. ఈ రెండు నెలలు ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు గత ప్రభుత్వం రూ.10,000 పరిహారం అందించింది. దీనికి మరో 10,000 కలిపి 20,000 ఇచ్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు మత్స్యకారుల్లో చర్చ జరుగుతోంది. ఈ ప్రక్రియ ఆలస్యం కావడానికి ఇదో కార ణమైతే కావచ్చు కానీ, లబ్ధిదారుల సహ నాన్ని పరీక్షించేలాఉండడంతో ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి పెరుగుతోంది. ఇదే సమయంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన మత్స్యకారులు వేట లేక ఇబ్బందులు పడుతున్నారని అధికా రులు వెంటనే స్పందించి ఆంక్షలు సడ లించి, మత్స్యకారులు పింఛన్లు, రైతు భరోసాలు, ఇతరత్రా సంక్షేమ పథకాలు దృష్టిలో పెట్టుకోకుండా అందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు ముక్తకంఠంతో కోరు తున్నారు. దీనిపై మత్స్య శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి గతంలో ఉన్న నిబంధనలు సడలించి అందరికీ భరోసా కల్పించాలని ఎకువూరు గ్రామానికి చెందిన మత్స్యకారులు కొండ జోగారావు, కొండ గురుమూర్తి, దుమ్ము రామారావు, మైలపల్లి బాలరాజు, మాగుపల్లి పాపారావు, సూరాడ బైరాగి, బైపల్లి గున్నారావు, వాసుపల్లి , గణపతితో పాటు జిల్లా మత్స్యకారులు కోరుతున్నారు.

# ముత్యం ధన్యజీవి

● ఘనంగా బొడ్డపాడులో ముత్యం సంతాప సభ




పలాస, ఆగస్టు 25(వార్త): పలాస మండలం బొడ్డపాడులో ఆదివారం ఘనంగా ప్రొఫెసర్ ముత్యం సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్యం 45 ఏళ్లుగా సాహిత్య పరిశోధన చేసి చరిత్రకు అదనపు సంపదను చేకూర్చారన్నారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తిరి దానేష్ మాట్లాడుతూ పీడిత ప్రజల వైపున నిలబడిన మహనీయుల చరిత్రను వెలుగులోకి తెచ్చిన ముత్యం జీవితం ధన్యమైందని కొనియాడారు. సీపీఐ(ఎంఎల్) సీనియర్ నాయకుడు మద్దిల మల్లేశ్వరరావు మాట్లాడుతూ ముత్యం సునాముది జీవధార పుస్తకం ద్వారా ఈ ప్రాంత రైతాంగ ఉద్యమాల్ని, చరిత్రను ప్రజల కోణంలో రచించారని కొనియాడారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్ మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆనాడు పీడీఎస్‌యూ ఆర్ట్స్ కాలేజ్ అధ్యక్షుడిగా ఎన్నికైన ముత్యం అదే భావజాలంతో జీవితాంతం జీవించారని తెలిపారు. ఆయన మృతికి వివిధ ప్రజా సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు.

కార్యక్రమం లో పౌర హక్కుల సంఘం జిల్లా కార్య దర్శి పిండి వెంకట్రావు, పీడీఎం రాష్ట్ర నాయకులు సాలిన వీరాస్వామి, లిబరే షన్ నాయకులు తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, ఇఫ్టూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, ఏఐకేఎంఎస్ నాయకులు మామిడి భీమారావు, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు రామారావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తెప్పల ఢిల్లీరావు, దున్న శ్రీనివాస్, పోతనపల్లి కామేశ్వరరావు, వైకుంఠరావు, పోలారావు, న్యాయవాది విజయ్, పీవో డబ్ల్యు జిల్లా అధ్యక్షుడు బి.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.








## రైతుబజారు ఏర్పాటుకు స్థల పరిశీలన

పలాస, ఆగస్టు 25(వార్త):పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో రైతుబజార్ ఏర్పాటుకు పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి స్థల పరిశీలన చేశారు. పాత బస్టాండ్ వద్ద కాయగూరలు అమ్ముతున్న రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు వజ్జ బాబూరావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్‌కుమార్, దువ్వాడ శ్రీకాంత్, జోగి మల్లేసు, డొక్కరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐతో పోలాకి, నరసన్నపేట ఎస్ఐల భేటీ



నరసన్నపేట, ఆగస్టు 25(వార్త): నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాసరావును నరసన్నపేట, పోలాకి ఎస్ఐలు దుర్గాప్రసాద్, రంజిత్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐకి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం వారితో సీఐ సమీక్ష నిర్వహిస్తూ శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ రెండు మండలాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## నరసన్నపేట ఎస్ఐగా దుర్గాప్రసాద్



నరసన్నపేట, ఆగస్టు 25(వార్త): నరసన్నపేట నూతన ఎస్ఐగా దుర్గాప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చేస్తానన్నారు.ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడతామని తెలిపారు. ఇంతకుముందు ఎస్ఐగా పనిచేసిన అశోక్‌బాబు జలుమూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

### మహతి కళాకారులకు..

# జాతీయ తెలుగు సంస్కృతి పురస్కారాలు



ఇచ్ఛాపురం, ఆగస్టు 25(వార్త): మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ మహతి కళాకారులు తిప్పన ధనుంజయరెడ్డి, పరపటి లింగమూర్తిని ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించింది. తెలుగు సంస్కృతి సాహితీసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అంతకుముందు మహతి కళాకారులు తమ ప్రదర్శన గావించారు. అనంతరం వారిని గౌరవ అతిథులు పానెపల్లి నంసింహాచారి, మాచారం గౌరీశంకర్, అద్దంకి నాగేశ్వరరావు, కొత్తూరు లీలావతి, కేసరి సురేష్ తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. పురస్కర గ్రహీతలకు ఆలిండియా కళారంగం రాష్ట్ర అధ్యక్షుడు మాడుగుల సుధీర్, ఆలిండియా కళారంగం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బుర్రకథ వెంకటరమణ, ఇచ్ఛాపురం కళాభారతి కళాకారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు నర్తు గంగయ్య, మహతి సాంస్కృతిక కళా సేవ సంస్థ గౌరవ అధ్యక్షుడు గౌనపలక్ష్మణమూర్తి, అధ్యక్షుడు రంగాల జానకిరామ్‌రెడ్డి, ఇచ్ఛాపురం, కవిటి కంచిలి, సోంపేట మండలాల కళాకారులు అభినందనలు తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నేడే కృష్ణాష్టమి నిర్వహించాలి

గార, ఆగస్టు 25(వార్త): శ్రీకృష్ణాష్టమిని సోమవారమే నిర్వహించాలని పండితులు సూచించారు. ఈ పండుగను ఎప్పుడు నిర్వహించాలో అనే సందిగ్ధం భక్తుల్లో నెలకొంది. అష్టమి ఘడియలు 26, 27 తేదీల్లో ఉండడంతో వారు ఓ అవగాహనకు రాలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 8గంటల 40నిమిషాలకు అష్టమ ఘడియలు మొదలై మంగళవారం ఉదయం 6గంటల 49 నిమిషాల వరకు ఈ ఘడియలు ఉంటాయని పండితులు తెలిపారు. సూర్యోదయానికి తిథి ఉండడంతో సోమవారమే జరపాలని వారు పేర్కొన్నారు.



# రహదారిద్ర్యం

### ప్రమాదాలకు నిలయంగా మారిన కాశీబుగ్గ -వి. కొత్తూరు రోడ్డు

### పాలకులు స్పందించి బాగు చేయాలని వాహనదారుల వినతి



(పలాస)

కాశీబుగ్గ-వి.కొత్తూరు రోడ్డు నిత్య ప్రమాదాలకు నిలయంగా మారింది. ఎన్నికల మధ్యలోనే ఆగిపోయిన రోడ్డు పనులతో వాహనదారులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

గత ప్రభుత్వం కాశీబుగ్గ నుంచి వజ్రపుకొత్తూరు వరకు సుమారు 35 కిలోమీటర్లు రోడ్డుకు సుమారు రూ.27 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు ఐదేళ్ల కిందట ప్రారంభమయ్యాయి. కానీ ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. అదీగాక బైపల్లి, అక్కుపల్లి గ్రామాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని ధర్మపు రము, అక్కలగెడ్డ, తాళ్లభద్ర గేటు, భారత్ గ్యాస్, కల్యాణ్ మండపము వరకు రోడ్డు పనులు మధ్యలో నిలిపేశారు. అయితే నిలిపేసిన రోడ్డుకు కూడా నిధులు మంజూరైనట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు ఈ రోడ్డు విస్తరణ కోసం కృషి చేయగా, అప్పట్లో కాశీబుగ్గ నుంచి శివ సాగర్ బీచ్ వరకు పనులు జరిగాయి. అయితే ఆ రోడ్డు పనులను కలిపి కొత్తరోడ్డు గుత్తేదారుడు బిల్లులు చేసి మమ అనిపించినట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ రహదారిలో ప్రయాణం నిత్య ప్రమాదాలకు నిలయంగా మారింది. వాహనాలు పాడైపోతున్నాయి, ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. దీంతో పాలకులు మారినా ఈ రోడ్డు పనులు పూర్తి కాలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటికైనా పాలకులు ఈ రోడ్డు పనులు జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు.





## దివ్యాంగుడికి కృత్రిమ కాలు, రూ.లక్ష అందజేత

మందస, ఆగస్టు 25 (వార్త): ఓ దివ్యాంగుడిని కొత్తవలసకు చెందిన గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆదుకుంది. సొండిపూడి గ్రామానికి చెందిన మదర్ వలంటీర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మల్లారెడ్డి భాస్కరరావు సహకారంతో మురపాక రామారావు అనే దివ్యాంగుడికి స్మాల్ ఇండస్ట్రీ డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిడ్బి), గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కృత్రిమ కాలు, జీవనోపాధికి రూ.లక్షను అందజేశారు. దీంతో రామారావు ఓ పాన్‌షాపు ఏర్పాటు చేసుకుని.. స్వయం ఉపాధి పొందుతున్నట్టు భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో వజ్జ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణభారతిలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 25 (వార్త): ఇచ్ఛాపురం స్వర్ణభారతి డిగ్రీ కాలేజీలో ఆదివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సీఐ ఎం.చిన్నంనాయుడు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాసురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చాట్ల సుజాత రెడ్డి, రాముురెడ్డి, ఆసి గౌరీశంకర్‌రెడ్డి, సందీప్, జయప్రకాష్, మద్దిలి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



సీఐ చిన్నంనాయుడిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

# సాగునీటి వనరులకు మరమ్మతులు చేయాలి

- కళింగదళ్, డబారుసింగి, గోపాలసాగర్, దామోదరసాగర్, చీపి గెడ్డ ప్రాంతాల్లో పర్యటించిన సీపీఎం బృందం



రైటప్: కళింగదళ్ రిజర్వాయర్ వద్ద మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మందస, ఆగస్టు 25(వార్త): కళింగదళ్, డబారుసింగి, గోపాలసాగరం, దామోదరసాగరాలను ఆధునికీకరించి రైతాంగానికి సాగునీరందివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యుడు కె.మోహనరావు డిమాండ్ చేశారు. ఆదివారం వారు ఈ ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళింగదళ్ రిజర్వాయర్ ఆయకట్టు 7000 ఎకరాలు, డబారుసింగి 1000 ఎకరాలు, దామోదర్ సాగర్ రిజర్వాయర్ 2000 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉండగా, మదుములు పాడైపోయి, కాలువలు తవ్వక, షట్టర్లు నాసిరకంగా ఉండడంతో నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చీపి గెడ్డ నుంచి వృధాగా పోతున్న నీటిని గోపాలసాగరానికి మళ్లించడం ద్వారా పది గ్రామాలకు చెందిన సుమారు 1000 ఎకరాలకు నీరు అందించవచ్చున్నారు. డబారుసింగి రిజర్వాయర్‌లో వర్షాకాలంలో కూడా చుక్కనీరు లేదని, ప్రాజెక్ట్ డిజైనింగు లోపమే రైతులకు శాపంగా మారిందని వారు వాపోయారు. ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మహేంద్రగిరుల నుంచి వచ్చిన నీరు వృధాగా సముద్రపాలవుతుందని విమర్శించారు. పాలకుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నదీ జలాల్ని ఉపయోగించుకోవడంలో పాలకులు వైఫల్యం చెందారని విమర్శించారు. ప్రాజెక్టులు కట్టి నాలుగు దశాబ్దాలు కావస్తున్నా కాలువలు తవ్వడం పూర్తికాలేదని విమర్శించారు. పాలకుల వైఫల్యమే జిల్లా రైతులకు శాపమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం నాయకులు సంగారు లక్ష్మీనారాయణ, కె.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన పనితీరు కనబరిచిన వారికి రుణాలు



ఆమదాలవలస, ఆగస్టు 25(వార్త): మహిళా స్వయంశక్తి సంఘాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన వారికి రుణాలందజేస్తామని వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు. ఆదివారం లక్పత్‌దీదీలు, సీఆర్పీలతో ఆమదాలవలసలో ర్యాలీ జరిపారు. అనంతరం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళా స్వయంశక్తి సంఘాల్లో తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలను గుర్తించాలన్నారు. వీరి జీవనోపాధిని మెరుగుపరిచే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ ద్వారా సభ్యులందరికీ వినిపించి, అవగాహన కల్పించారు. అనంతరం మెరుగైన పనితీరు కనబరిచిన సీఆర్పీలు, లక్పతిదీదీలను గుర్తించి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు తమ్మినేని ధనలక్ష్మి, గొర్ల ఉషారాణి, క్లస్టర్ కోఆర్డినేటర్లు రామప్పడు, రమణ, చంద్రరావు, సుభద్ర, ఉమ తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలలో ఇసుక నిల్వలు తొలగించండి

(నరసన్నపేట)

నరసన్నపేట మండలం ముసిడిగట్టు పంచాయతీ అంబాజీపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్థానికులు ఇసుక దిబ్బలు వేయడంతో పాఠశాల విద్యార్థులు ఆటలాడేందుకు ఇబ్బంది పడుతున్నారు. కొన్నాళ్లుగా గ్రామానికి చెందిన కొందరు పాఠశాల సమీపంలోనే వీటిని నిల్వ చేస్తున్నారు. ఇప్పటికైనా వాటిని తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



### పిచ్చి మొక్కలతో నిండిన..
## ఆరోగ్య కేంద్రం

(నరసన్నపేట)

నరసన్నపేట మండలం లుకలాం గ్రామంలో ఇటీవల నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర పరిసరాలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. సంబంధిత కేంద్రం చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిత్యం ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వెంటనే పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు. ఆయుష్మాన్ కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు గ్రామస్తులు చెప్పారు.




## ఒకేరోజు గ్రామసభలతో ప్రయోజనమేమీ?

### మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం, ఆగస్టు 25 (వార్త): ఒకేరోజు ఆర్భాటంగా అన్ని గ్రామ పంచాయతీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించినప్పటికీ ప్రజలకు ఏమీ ఉపయోగకరంగా లేవని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి విమర్శించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామ సభలు నిర్వహించామని ప్రభుత్వం, కూటమి నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నా.. ఎందుకు పనికి రాకుండా ఈ సభలు జరిగాయన్నారు. ఒకేరోజు గ్రామ సభల నిర్వహణతో ఉపాధి హామీ అధికారుబలందరూ ప్రతి గ్రామ సభకు హాజరు కాలేకపోయారన్నారు. దీంతో ప్రజల నుంచి ఆయా గ్రామాల సమస్యలు తెలుసుకునే దిశగా ముందడుగు పడలేదన్నారు. గ్రామసభలు నిర్వహించి గ్రామాల్లో పనులు చేయాలనే ఆలోచన బాగున్నప్పటికీ, సమయం లేకుండా.. గందరగోళంగా..తూతూమంత్రంగా గ్రామ సభల నిర్వహించడంపై ఆమె



ప్రభుత్వంపై మండిపడ్డారు. ఒక షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహిస్తే ఉపాధి హామీ పథకంలో చేయాల్సిన పనులకు సంబంధించిన వివరాలు తెలియజేయడానికి, సంబంధిత శాఖ అధికారులందరూ హాజరవడానికి అవకాశం ఉండేదని ఆమె అభిప్రాయపడ్డారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల వేళ ప్రజలను మభ్యపెట్టారు గానీ, వాటిని గాలికి వదిలేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రచార, ఆర్భాటాలు మాని ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని ఆమె కోరారు.



## ఉరకలేసిన ఉత్సాహం

### ఘనంగా సాయి వినీత్ విద్యాసంస్థల ఫేర్‌వెల్ డే

వజ్రపుకొత్తూరు / సంతబొమ్మాళి, ఆగస్టు 25(వార్త): వజ్రపుకొత్తూరు మండలం పూండిలో సాయివినీత్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ప్రథమ సంవత్సర ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే, డిగ్రీ విద్యార్థులకు వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయివినీత్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ కె.లీల, డాక్టర్ చాపర కోదండరావు మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో గొప్పదన్నారు. సక్రమంగా ఉపయోగించుకుంటే భవిష్యత్ ఉజ్వలభరితమై వికసిస్తుందన్నారు. నేర్చుకున్న విషయాలు జీవితానికి అన్వయించుకున్నప్పుడే విద్యకు మంచి అర్థం ఉందని తెలిపారు. విద్యార్థి జీవితంలో విజయాలు సాధించాలంటే కష్ట పడడం మాత్రమే కాకుండా ఇష్టంతో చదవాలని విద్యార్థులకు వారు సలహా ఇచ్చారు. విద్యార్థులు ఏ రంగంలో స్థిరపడాలన్న విషయాన్ని ఉన్నత చదువులు నిర్ణయిస్తాయన్నారు. గురువులను, తోటి విద్యార్థులను ఎన్నటికీ మరువరాదని సూచించారు. ఉన్నత చదువులు చదివి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఆ సంస్థల డైరెక్టర్ చాపర సాయివినీత్ మాట్లాడుతూ విద్యార్థులందరూ శ్రద్ధగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. క్రమశిక్షణతో కూడిన విద్య చాలా అవసరమన్నారు. మొబైల్స్ వాడకానికి దూరంగా ఉండాలని సూచించారు. విదార్థులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్సులు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ పూజిత, కళాశాల ప్రిన్సిపాల్ అన్నెపు కైలాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.సాయి గోపాల్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.







ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ రౌలో

## డీఎస్ఆర్ ఆసుపత్రి ప్రారంభం

ఇచ్ఛాపురం, ఆగస్టు 25(వార్త): ఇచ్ఛాపురంలో నూతనంగా నిర్మించిన డీఎస్ఆర్ ఆసుపత్రిని ఆదివారం ప్రముఖ వైద్యుడు డాక్టర్ మోహన్‌రౌలో ప్రారంభించారు. సోంపేటకి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ దల్లి సురేష్‌రెడ్డి, డాక్టర్ సత్తి నాగరమ్య ఈ ఆసుపత్రిలో వైద్య సేవలందించనున్నారు. కార్యక్రమంలో సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మాన దాసు, వైద్యులు జయప్రకాష్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, తాడి అదిరెడ్డి, సత్తి రెడ్డి, నందికి జానీ తదితరులు పాల్గొన్నారు.

### కాశీబుగ్గ రైల్వే గ్రౌండ్ ప్రాంగణంలో..
## నేడు శ్రీకృష్ణాష్టమి వేడుకలు



విలేకరులతో మాట్లాడుతున్న యాదవ సమితి నాయకులు

పలాస, ఆగస్టు 25 (వార్త): కాశీబుగ్గ రైల్వే గ్రౌండ్ ప్రాంగణంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని పలాస యాదవ సేవాసమితి తెలిపింది. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని కృష్ణ భగవానుని అనుగ్రహం పొందాలని వారు కోరారు. ఈ వేడుకలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐకి సన్మానం



ఇచ్ఛాపురం, ఆగస్ట్ 25 (వార్త): ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఈమంది శ్రీనివాసరావును ఆదివారం నియోజకవర్గ సినీ కళాకారుల సంఘం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు బుడ్డేపు.కామేష్ రెడ్డి బెందాళం రాజేష్, దడ్డ నాగు తదితరులు మాట్లాడుతూ ఎస్ఐ సినిమాలకు రచనా సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఆయన కుమార్తె కూడా కార్తికేయ సినిమాలో నటించారని చెప్పారు.దీంతోనే తమ సంఘం తరపున సన్మానించామని తెలిపారు.

## వంద మంది యాచకులకు గొడుగుల పంపిణీ

పలాస, ఆగస్టు 25(వార్త): తన జన్మదినం సందర్భంగా మండల తెలుగుదేశం నాయకుడు కిక్కర ఢిల్లీరావు వందమంది యాచకులకు గొడుగులు పంపిణీ చేశారు. ఎస్‌వీఎస్ఎస్ సంస్థకు రూ.2,000 విరాళం ఇచ్చినట్లు తెలిపారు..



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413